నేడు ఆలయ హుండీ లెక్కింపు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 10గంటలకు హుండీ కానుకలు లెక్కించనున్నారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ జానకీసుధాకర్, ఈఓ ఎం.దేవనాథం ఓ ప్రకటనలో కోరారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్‌లో పాల్గొన్న నజీర్ అలీ తదితరులు

ముషీరాబాద్: భోలక్‌పూర్ బడీ మసీదులో మంగళవారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్య అతిథిగా మసీదు ముత్తవల్లి నజీర్ అలీ హాజరై సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇఫ్తార్ విందును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహిన్, బాబర్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి

అంబర్‌పేట: ఆస్తిపన్నుపై వేసిన వడ్డీ రుసుంలో ఇస్తున్న 90 శాతం రాయితీని పన్ను చెల్లింపుదారులు సద్వినియోగం చేసుకోవాలని సర్కిల్–16 డీఎంసీ మారుతీదివాకర్ కోరారు. ఈ నెల చివరి వరకు గడువు ఉందన్నారు. ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అలాగే బస్తీలు, కాలనీ అసోసియేషన్లు ఆస్తిపన్ను చెల్లించేందుకు ముందుకొస్తే తమ సిబ్బందిని అక్కడికే పంపించి సేవలందిస్తామని తెలిపారు.

కల్యాణం.. కమనీయం



ముషీరాబాద్: పద్మశాలికాలనీ సంజీవ ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారికి పట్టువస్త్రాలను ఎమ్మెల్యే ముఠా గోపాల్ సమర్పించారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ వేడుకలో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీతామార్కండేయ, పుండరీకం, కోశాధికారి గడ్డం నవీన్‌కుమార్, సలహాదారులు ఆర్.ఆంజనేయులు, కృష్ణమూర్తి, కార్యనిర్వహక కార్యదర్శులు వెంకటేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఆర్‌డీ మహిళా విభాగం రాష్ట్ర కమిటీ ఎన్నిక



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) మహిళా విభాగం రాష్ట్ర కమిటీ ఎన్నిక మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిందని సంఘం ప్రధాన కార్యదర్శి అడివయ్య తెలిపారు. కన్వీనర్‌గా సి.సాయమ్మ, కో–కన్వీనర్లుగా నాగలక్ష్మి, భాగ్యలక్ష్మి, కవిత, జయమ్మ, సావిత్రి, షాహిన్ బేగం, కమిటీ సభ్యులుగా చంద్రమ్మ, మేరి, నీరజారెడ్డి, విజయలక్ష్మి, సంతోష, నిర్మల, సత్తమ్మ, లక్ష్మి, మంగమ్మ, భానుప్రియతో పాటు 27 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

జిజ్ఞాస పోటీలలో సత్తాచాటిన వివేకానంద కళాశాల

ముషీరాబాద్: విద్యానగర్‌లోని వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల జిజ్ఞాస రాష్ట్రస్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. గణిత విభాగంలో 'ఏ వర్కింగ్ మోడల్ ఆఫ్ క్రిప్టోగఫీ యూజింగ్ మ్యాట్రిసెస్ అండ్ మాడ్యూలర్ అర్థమెటిక్'.. వృక్షశాస్త్ర విభాగం నుంచి 'రోల్ ఆఫ్ ప్లాంట్ ఎక్స్‌ట్రాక్ట్ కోటింగ్ ఇన్ ఇంప్రూవింగ్ క్వాలిటీ అండ్ సెల్ఫ్ లైఫ్ ఆఫ్ ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్'.. జంతుశాస్త్ర విభాగం నుంచి 'కంట్రోలింగ్ కాక్రోచెస్ విత్ సర్టైన్ ప్లాంట్ ఎక్స్‌ట్రాక్స్' అనే అంశాలపై విద్యార్థులు సమర్పించిన ప్రాజెక్టు వర్క్స్ అందరి మన్ననలు పొందింది. ఈ మూడు సబ్జెక్టులకు సంబంధించిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయిలో గెలుపొందడం ఎంతో సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అధ్యాపకులు వి.మనోజ్‌కుమార్, డాక్టర్ అనురాధ, డాక్టర్ మహేష్ తదితరులు అభినందించారు.



జిజ్ఞాస విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభు, అధ్యాపకులు

అలసత్వం.. నిర్లక్ష్యం.!

నారాయణగూడ ప్రధాన రహదారిలో..



- కాచిగూడ డివిజన్‌లో నోళ్లు తెరిచిన మ్యాన్‌హోళ్లు
- రోడ్లకు ఇరువైపులా వాహనాల అక్రమ పార్కింగ్
- అధ్వానంగా మారిన అంతర్గత రోడ్లు
- అధికారుల నిర్లక్ష్య ధోరణిపై స్థానికుల ఆగ్రహం



బర్కత్‌పురలోని అవంతి కళాశాల రోడ్డులో...

కాచిగూడ: అధికారుల నిర్లక్ష్యంతో కాచిగూడ డివిజన్ ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట అంతర్గత రోడ్లపై నడవాలంటేనే జంకుతున్నారు. నిత్యం తెరిచి ఉన్న మ్యాన్‌హోళ్లు, గుంతలు పడ్డ రోడ్లు, రోడ్లకిరువైపుల అక్రమంగా వాహనాల పార్కింగ్‌లతో అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాచిగూడ, బర్కత్‌పుర, నారాయణగూడ తదితర ప్రాంతాల్లో పలు చోట్ల ఎక్కడికక్కడ తెరిచి ఉన్న మ్యాన్‌హోళ్లను చూసి ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు. ప్రజల సమస్యలు అధికారులకు పట్టవా? అని ప్రశ్నిస్తున్నారు. నెలల తరబడి మ్యాన్‌హోళ్ల మూతలు తెరిచి ఉన్నా.. రోడ్లపై మ్యాన్‌హోళ్లు కుంగిపోయి ఉన్నా అటుగా వెళ్లే సిబ్బందికి, అధికారులకు ఒక్కసారైనా కానరావా అని ప్రశ్నిస్తున్నారు. నిత్యం తెరిచి ఉన్న డ్రైనేజీ మూతల కారణంగా దుర్గంధభరిత వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వెంబడి తెరిచి ఉన్న మ్యాన్‌హోళ్లలో పలు సందర్భాల్లో పాదచారులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. అధికారులు స్పందించి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిచండంలో శ్రద్ధ కనబరచాలని స్థానికులు కోరుతున్నారు.



బర్కత్‌పుర బస్‌డిపో రోడ్డులో..

రోడ్లపైనే చెత్తాచెదారం..

ప్రధాన రోడ్లపై చెత్తను డంపింగ్ చేయడంతో పాటు పలు అంతర్గత రోడ్లపై మట్టికుప్పలు, చెత్త కుప్పలు నెలల తరబడి పేరుకుపోయి ఉంటున్నాయి. చెత్త కుప్పల్లో పేరుకుపోయిన కుళ్లిన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ కవర్లు తిని పశువులు మృత్యువాత పడుతున్నాయని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా నింబోలిఅడ్డ ప్రధాన రహదారిలో సమోసా పార్కు వద్ద, మహంకాళి దేవాలయం వద్ద చెత్తను డంపింగ్ చేస్తున్నారు. చెత్త నుంచి వచ్చే దుర్వాసనను తట్టుకోలేక పోతున్నామని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ సమస్యలపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.



చెత్తాచెదారంతో నిండిన జాహ్నవి కాలేజ్ రోడ్డు



చెత్త డంపింగ్‌యార్డుగా మారిన నింబోలిఅడ్డ సమోసా పార్కు రోడ్డు

విక్రమ్‌నగర్ పార్కు వద్ద ఇలా..



అక్రమ పార్కింగ్‌తో పరేషాన్..

అసలే ఇరుకైన రోడ్లు.. అపై రోడ్లకు ఇరు వైపులా వాహనాల అక్రమంగా పార్కింగ్‌తో రాకపోకలకు తీవ్ర అనంతరం వాహనదారులు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్లపై చెత్త, మట్టికుప్పలు పేరుకుపోయినా వాటిని తొలగించడంలో అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లపై ఏర్పాటు చేస్తున్న అక్రమ వాహనాల పార్కింగ్‌లతో ప్రజలు పడుతున్న బాధలు వర్ణణాతీతంగా ఉంటున్నాయి. ముఖ్యంగా విక్రమ్‌నగర్ పార్కు వద్ద రోడ్డుకిరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అలాగే శివాజీనగర్ బస్తీలో వాహనాలతో పాటు వస్తు సామగ్రిని రోడ్లపైనే పెడుతుండటంతో బస్తీ రోడ్లు మొత్తం అపరిశుభ్రంగా మారుతోంది. అక్రమ పార్కింగ్‌లను తొలగించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా వాహనాలను తొలగించడం లేదని స్థానికులు తెలిపారు. ఈ విషయంలో అధికారులు స్పందించి వాహనాల అక్రమ పార్కింగ్‌ను తొలగించి ప్రజలు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నారు.



శివాజీనగర్‌లో రోడ్డుకిరువైపులా అక్రమ పార్కింగ్

బీసీలకు వందశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

కాచిగూడ: బీసీ విద్యార్థులకు వంద శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చెరుకు మణికంఠ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో రిజర్వేషన్లు అమలు చేయడానికి ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలన్నారు. చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు అమలు చేసి దేశవ్యాప్తంగా సమగ్ర కులగణనను చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

లేబర్ ఆఫీస్ వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారం

చిక్కడపల్లి: జవహర్‌నగర్‌లోని రాష్ట్ర కార్మికశాఖ కార్యాలయం వెళ్లే ప్రధాన రోడ్డులో నెల రోజులుగా చెత్తాచెదారం పేరుకుపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. అక్కడే కొందరు మూత్ర విసర్జన చేయడంతో ఆ ప్రాంతం దుర్గంధంగా మారింది. ఇక్కడే చిక్కడపల్లి ఏసీపీ, పోలీస్‌స్టేషన్ కార్యాలయాలతో పాటు శ్రీఆంజనేయస్వామి ఆలయం ఉంది. పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తరలించడం లేదు. ఈ రోడ్డు గుండానే త్యాగరాయ గానసభ, నగర కేంద్ర గ్రంథాలయానికి వెళ్తారు. ఇప్పటికైనా లేబర్ కమిషనర్ కార్యాలయం పరిసరాలను శుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరుతున్నారు. దీనికి తోడు అక్రమంగా పార్కింగ్‌తో రోడ్డు కుంచించుకుపోయింది. ఇక్కడ వాహనాలను పార్కింగ్ చేయకుండా చూడాలని కోరుతున్నారు.



కార్మికశాఖ కార్యాలయం రోడ్డులో చెత్తాచెదారం

దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తా



ప్రేమ్‌నగర్‌లో పర్యటించి స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం ప్రేమ్‌నగర్‌లో ఆయన పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు అమ్మవారి ఆలయ అభివృద్ధి అంశాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య, వీధి దీపాలు, దోమల బెడద వంటి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, వివిధ విభాగాల అధికారులు, స్థానిక నాయకులు సిద్ధార్థ ముదిరాజ్, రామరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ పునర్‌నిర్మాణ పనులు ప్రారంభం..

బాగ్‌అంబర్‌పేట డివిజన్ చెంచుబస్తీలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఆలయ నిర్మాణానికి తన సొంత నిధులు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు.

దోమల బెడదను నివారించండి

అంబర్‌పేట: దోమల బెడదతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే పరిష్కార చర్యలు తీసుకోవాలని గోల్నాక కార్పొరేటర్ లావణ్య అధికారులకు సూచించారు. మంగళవారం ఆమె డివిజన్‌లోని మూసీ పరీవాహక ప్రాంతాలైన లంకబస్తీల్లో ఆమె స్థానికులతో కలిసి పర్యటించారు. మూసీలో గుర్రపుడెక్క పెరిగిపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వెంటనే గుర్రపుడెక్కను తొలగించి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంటమాలజీ సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గోల్నాక లంకబస్తీలో స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ లావణ్య

పనులు పూర్తిచేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలి



పైప్‌లైన్ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

చిక్కడపల్లి: సబర్మతినగర్‌లో త్వరితగతిన పైప్‌లైన్ పనులు పూర్తిచేసి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని వాటర్‌వర్క్స్ అధికారులు, కాంట్రాక్టర్లకు గాంధీనగర్ కార్పొరేటర్ పావని సూచించారు. మంగళవారం సబర్మతినగర్‌లో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ బీజేపీ కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలిసి ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రానున్న ఉగాది, రంజాన్‌లోపే పనులు పూర్తి చేసి నీరు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఉమేష్, నాయకులు డి.కుమార్, ఆనంద్ రావు, సాయికుమార్, నీరజ్, బస్తీవాసులు నర్సింగ్‌రావు, లక్ష్మణ్, ధన్‌రాజ్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 2న వీఎస్‌టీ సొసైటీ వర్కర్స్ యూనియన్ ఎన్నికలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: వీఎస్‌టీ ఎంప్లాయీస్ కన్స్యూమర్ కో–ఆపరేటీవ్ సొసైటీ వర్కర్స్ యూనియన్‌కు ఏప్రిల్ 2వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని కన్స్యూమర్ సొసైటీ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియ జరిగింది. ఎన్నికల అధికారిగా కో–ఆపరేటీవ్ శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శివకుమార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ నామినేషన్‌లు స్వీకరించారు. ఈ ఎన్నికల్లో వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ ప్రస్తుత అధ్యక్షుడు, మాజీ ఎంపీ, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి.సంజీవరెడ్డి ప్యానల్ తరుపున హబీబ్ షరీఫ్ తదితరులు నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా వీఎస్‌టీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు దివంగత హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ప్యానల్ నుంచి అభిలాష్ తదితరులు నామినేషన్ వేశారు. అదే విధంగా బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్యానల్ తరుపున జి.సచిన్‌గౌడ్ తదితరులు నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఎన్నికల అధికారి మాట్లాడుతూ... ఈనెల 27వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. ఏప్రిల్ 2న సాయంత్రం ఫలితాలు వెలువడుతాయని అన్నారు.



ఎన్నికల అధికారికి నామినేషన్ దాఖలు చేస్తున్న ఓ ప్యానల్ అభ్యర్థులు

మహిళను మోసగించిన వ్యక్తి అరెస్ట్

కాచిగూడ: మహిళను మోసగించిన ఓ వ్యక్తిని కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాకకు చెందిన మహిళ (31) భర్త చనిపోయాడు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. చిరు వ్యాపారి రితేష్ జైస్వాల్ (37) ఆమెతో ఏడాదిన్నర పాటు సహజీవనం చేశాడు. పెళ్లి చేసుకోవడానికి నిరాకరించడంతో మూడు రోజుల క్రితం మహిళ విషం తాగి ఆత్మహత్యకు యత్నించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేశారు. నిందితుడు రితేష్ జైస్వాల్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు రైల్లో నుంచి కిందపడి వ్యక్తి మృతి

కాచిగూడ: నడుస్తున్న రైల్లో నుంచి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... బిహార్‌కు చెందిన సోహేల్ అహ్మద్ (38) సైదాబాద్‌లో ఉంటూ రైళ్లలో సమోసాలు, టిఫిన్స్, వాటర్ బాటిల్స్ అమ్ముతుంటాడు. సోమవారం సికింద్రాబాద్ నుంచి మలక్‌పేటకు రైల్లో ప్రయాణిస్తుండగా నింబోలిఅడ్డ వద్ద రైల్లో నుంచి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సినీసంగీత విభావరి



పేరి నాగేశ్వర్‌రావు, విజయలక్ష్మిని సన్మానిస్తున్న హరి శ్రీనివాస్, భీమశంకరం

చిక్కడపల్లి: ద్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్, సాంస్కృతిక సేవా సంస్థ విజయ క్రియేషన్స్ ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. బహుళ గాయకుడు పేరి నాగేశ్వర్‌రావు, విజయలక్ష్మి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో గాయకులు శ్రావ్యంగా పాటలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు హరి శ్రీనివాస్, భీమశంకరం, కామేశ్వరావు, త్రినాథరావు, హనుమంతరావు, కర్రా శ్రీనివాస్ కల్యాణి దేశ్‌పాండే పాల్గొన్నారు.

క్రీడలపై దృష్టి సారించాలి

ముషీరాబాద్: చదువుతో పాటు క్రీడలపై విద్యార్థులు దృష్టి సారించాలని జాతీయ యువజన పురస్కార గ్రహీత, ఐషా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి పానుగంటి మహేష్‌కుమార్ అన్నారు. మంగళవారం గాంధీనగర్‌లోని గంటసాల క్రీడా మైదానంలో స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో భాగంగా కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహేష్‌కుమార్ విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారిణి ఖుష్బుగుప్తా, క్రికెట్ కోచ్ రాజ్‌కుమార్, వాలీబాల్ కోచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే భారత రాజ్యాంగం గొప్పది

యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: ప్రపంచంలోనే భారత రాజ్యాంగం గొప్పదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్'లో భాగంగా జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్ భవనంలో మంగళవారం కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు వీడీ కృష్ణ ఆధ్వర్యంలో ముషీరాబాద్ నియోజకవర్గం సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ... స్వార్థ రాజకీయాల కోసం కొందరు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విభేదాలు సృష్టిస్తూ సమాజంలో అశాంతిని నెలకొల్పుతున్నారని విమర్శించారు. అనంతరం రాజ్యాంగంలో అందరికి కల్పించిన సమాన హక్కులు, ఆశయాలను కాపాడటానికి చిత్తశుద్ధి, అకింత భావంతో కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, గుర్రం చంద్రకళ, డివిజన్ల అధ్యక్షులు పి.భాస్కర్, అభిషేక్‌కెనడీ, జహీరుద్దీన్, జోహర్ హుస్సేన్, తిరుమల్, పెండెం శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది పాశం అనిల్‌కుమార్, నేతలు గుర్రం శంకర్, నర్సింగరావు, కేఆర్‌కే ప్రసాద్, బాబ్జీ, సురేష్‌యాదవ్, జగష్‌బాబు, కవిత తదితరులు పాల్గొన్నారు.



నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌కుమార్ యాదవ్

కుంచెతో వి'చిత్రాలు'



కాచిగూడ: చిత్రలేఖనంలో చిన్ననాటి నుంచి ఉన్న తన అభిరుచిని వదిలేయకుండా 65 ఏళ్ల వయసులోనూ అనేక చిత్రాలు గీస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మాలతి. ఐదేళ్లుగా ఖాళీ సమయంలో గీసిన అనేక చిత్రాలను ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను ఆధ్యాత్మికవేత్త దైవజ్ఞ శర్మ కాచిగూడలో మంగళవారం ప్రారంభించారు. ఇంటి భారంతో పాటు ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటూ ఇంత చక్కటి చిత్రాలను గీసిన మాలతిని పలువురు సందర్శకులు అభినందిస్తూ ప్రశంసించారు. పుస్తకాలను చదివి వాటిని ఊహారూపంలో ఊహించుకొని కథల రూపంలో చిత్ర ప్రదర్శనగా ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. తాను ఏ కథ చదివినా దానిని చిత్రరూపంగా మార్చడమే తన లక్ష్యమని మాలతి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గుంటక రూప, గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు పోరండ్ల శారద, తదితరులు పాల్గొన్నారు.



దైవజ్ఞశర్మకు తాను గీసిన చిత్రాలను చూపిస్తున్న మాలతి

శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేయండి

కాచిగూడ: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 6వ తేదీన నిర్వహించనున్న శోభాయాత్రను విజయవంతం చేయాలని కాచిగూడ కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం కాచిగూడలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. శోభాయాత్ర కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేసి యాత్రలో పాల్గొనే విధంగా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు భగత్‌జీ, వాసు, దిలీప్, ఆర్.సంతోష్, సూరి, ఎస్.రవియాదవ్, వెంకటేష్, సహాని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్

కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



ముషీరాబాద్: కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో ఆర్‌బీఎస్‌కే సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేశారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ రోజుల్లో కంటి చూపు సమస్య ఎక్కువైందన్నారు. పిల్లలు ఫోన్, టీవీలు ఎక్కువ సమయం చూడొద్దని కోరారు. దీని వల్ల కంటి చూపు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రతన్, ఇస్మాయిల్, ఆర్‌బీఎస్‌కే సంస్థ వైద్యులు లారా, శ్రీదేవి, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.